ప్రజాశక్తి
బుధవారం 1 ఫిబ్రవరి 2023
5
విజయనగరం



నేటి నుంచి రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడి పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి. కాంతారావు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నారని జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు (బుధవారం) సంబంధిత విభాగాల అధికారులతో కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉదయం 10 గంటల నుంచి సమీక్షా సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. మిగిలిన రెండు రోజులు జిల్లాలోని అంగన్ వాడీ కేంద్రాలను, చౌకధరల దుకాణాలను సందర్శిస్తారన్నారు. కార్యక్రమంలో భాగంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి పౌష్టికాహారం, రేషన్ బియ్యం పంపిణీ గురించి ఇతర ఆహార సంబంధిత పథకాల గురించి పరిశీలిస్తారని పేర్కొన్నారు. మాతృవందన యోజన పథకం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా జిల్లాలో అందుతున్న సేవలపై ఆరా తీస్తారని జెసి తెలిపారు.

అక్కరకు రాని ఆర్థిక సంఘం నిధులు

- పంచాయతీల్లో తీవ్రమవుతున్న ఆర్థిక ఇబ్బందులు
- పారిశుధ్య కార్మికులకు వేతనాలు కరువు
- భారంగా తాగునీటి పథకాల నిర్వహణ
- విద్యుత్ ఛార్జీల చెల్లింపునకూ కటకట
- కేంద్రం వివక్షపై నోరు మెదపని పాలకులు



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కపెట్టడంతో గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నాయి. విద్యుత్ ఛార్జీల చెల్లింపునకు పంచాయతీలు కటకటలాడుతున్నాయి. పారిశుధ్య కార్మికులు (గ్రీన్ అంబాస్‌డర్లు)కు వేతనాలు చెల్లించలేని దుస్థితి దాపురిస్తోంది. తాగునీటి పథకాల నిర్వహణ, నీటి సరఫరా బహు భారంగా మారే ప్రమాదం కనిపిస్తోంది. ఇలా ఒకటేమిటి కేంద్ర ప్రభుత్వ వైఖరితో స్థానిక సంస్థల మనుగడ దినదిన గండంగా మారింది. పాలకులు మాత్రం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదు. అభివృద్ధి అనే మాటను పూర్తిగా పక్కనుబెట్టేసి సాధారణ నిధులతోనే కాలక్షేపం చేస్తున్నారు. గ్రామ స్థాయిలో సర్పంచులు మాత్రం ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది.

వివిధ రూపాల్లో ప్రజల నుంచి పన్ను వసూలు చేస్తున్నందున రాజ్యాంగం ప్రకారం సగటు మనిషికి రూ.8 చొప్పున పంచాయతీలకు, రూ.4 చొప్పు మండల, జిల్లా పరిషత్‌లకు కేంద్ర ప్రభుత్వం కేటాయించాల్సివుంది. ఈలెక్కన ఉమ్మడి విజయనగరం జిల్లాకు 2022-23 ఆర్థిక సంఘానికి సంబంధించి మండల, జిల్లా పరిషత్‌లకు 15శాతం చొప్పున రూ.40కోట్లు, గ్రామ పంచాయతీలకు 70శాతం చొప్పున సుమారు రూ.93కోట్ల మేర రావాల్సివుంది. ఏటా ఇలా వస్తున్న నిధులతోనే తాగునీటి పథకాలు, పారిశుధ్యం నిర్వహణ, వాటిలో పనిచేస్తున్న సిబ్బంది జీతభత్యాలు, విద్యుత్ ఛార్జీలు, గ్రామాల్లోని ఇతర సమస్యలు పరిష్కరించేవారు. బిజెపి అధికారంలోకి వచ్చాక ఆర్థిక సంఘం నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో స్థానిక సంస్థలన్నీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. గడిచిన ఎనిమిదేళ్లగా మూడు నెలల నుంచి, ఆరు నెలల బకాయి కొనసాగించగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో రెండు నెలల్లో ముగియనున్నప్పటికీ పైసా కూడా విడుదల చేయలేదు. దీంతో, రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన సర్పంచులు, ఎంపిటిసి, జెడ్‌పిటిసి సభ్యులు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజల కనీస అవసరాలు తీర్చలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఇటు ప్రజలు అటు పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్యం, వాటర్‌వర్క్సు తదితర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విద్యుత్ బకాయిలూ సకాలంలో తీర్చలేకపోవడంతో అధికారులు తీవ్ర ఒత్తిడికి గురి కావాల్సివస్తోంది. మరోవైపు కరోనా కారణంగా 2020 నుంచి రిజిస్ట్రేషన్లు, దుకాణాల అద్దెలు వంటివి అమాంతంగా తగ్గిపోవడంతో స్థానిక సంస్థలకు రావాల్సిన ఆదాయం తగ్గింది. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నప్పటికీ ఒకే దేశం, ఒకే పన్ను అంటూ ప్రజలపై వివిధ రూపాల్లో రకరకాల పన్నులు మోపేందుకు, ధరల పెంపునకు మాత్రం కేంద్రం వెనుకాడడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన మన జిల్లా పాలకులు తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. అధికార ప్రతిపక్షాలకు వచ్చే ఎన్నికలే లక్ష్యంగా పరస్పర రాజకీయ విమర్శలు, విన్యాసాలు మినహా ప్రజల సమస్యలు గానీ, కేంద్రం చూపుతున్న వివక్షగానీ పట్టడం లేదు. పాలకుల వైఖరిపై సర్పంచులు, ఇతర స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. చిత్తశుద్ధి ఉంటే అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు, ఎమ్మెల్యే, ఎంపీలు కేంద్రాన్ని ప్రశ్నించాలని జనం కోరుతున్నారు.


తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

ధాన్యం రైతుల ఆందోళన

ధాన్యానికి నిప్పంటించి నిరసన


ధాన్యానికి నిప్పు పెట్టిన రైతులు

ప్రజాశక్తి-మెంటాడ

ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ టిడిపి ఆధ్వర్యాన రైతులు మంగళవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ధాన్యానికి నిప్పంటించి నిరసన తెలిపారు. వైసిపి నాయకుల ధాన్యం మాత్రమే కొంటారా? సాధారణ రైతుల నుంచి ధాన్యం కొనరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు చలుమూరి వెంకటరావు మాట్లాడుతూ అధికారులు టిడిపి మద్దతు దారుల రైతులకు ట్రక్ షీట్ లు ఇవ్వడం లేదని ఆరోపించారు. గ్రోత్ రేటు పెరిగితే ధాన్యం కొనుగోలు, చెల్లింపులు ఎందుకు జరపడంలేదని ప్రశ్నించారు. ధాన్యం విక్రయించిన రైతులకు బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మండలానికి ఇచ్చిన 74 శాతం టార్గెట్ పూర్తయ్యిందని, ప్రభుత్వ నుంచి అనుమతి వచ్చాక కొనుగోలు చేస్తామని ఎఒ గోకుల కృష్ణ చెప్పడంతో రైతులు ఆగ్రహం చెందారు.అనంతరం ఉప తహశీల్దార్ వెంకటరావుకు వినతి అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జి.అన్నవరం, రెడ్డి ఎర్నాయుడు, సిరిపురం గురునాయుడు, రెడ్డి సూరిబాబు, రాజగోపాల్, కాశీ విశ్వేశ్వరలిరావు, రామలింగేశ్వరరావు, గొర్లె ముసలి నాయుడు, సిపిఎం నాయకులు రాకోటి రాములు తదితులుపాల్గొన్నారు.

ఘనంగా పోలమాంబ మారుజాతర

అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు


శంబరలో బారులు తీరిన జనం

ప్రజాశక్తి - మక్కువ

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత శంబర పోలమాంబ అమ్మవారి మారు జాతర మంగళవారం ఘనంగా జరిగింది. మంగళవారం అమ్మవారిని భక్తులు పెద్దఎత్తున దర్శించుకున్నారు. వనం గుడి వద్ద వేప చెట్టుకు భక్తులు పూజలు చేశారు. దేవాదాయ శాఖ అధికారి కెవిఎల్ సుధారాణి, కార్యనిర్వహణాధికారి పి.రాధాకృష్ణ భక్తులకు ఎటువంటి అసౌకర్యాలూ కలగకుండా ఏర్పాట్లు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో గంటల తరబడి క్యూలో ఉండాల్సి వచ్చింది. ఆలయానికి వచ్చే భక్తులకు క్యూలైన్లలో తాగునీటిని సరఫరా చేశారు. భక్తులకు అమ్మవారి ప్రసాదాలు సరిపడేలా అందుబాటులో ఉంచారు. రహదారులు సక్రమంగా ఉండడంతో జాతరకు వచ్చే వాహనాలకు ఎలాంటి ఇబ్బందులూ కలగలేదు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. స్థానిక సిఐ ధనుంజయరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. గత జాతర మాదిరిగానే ద్విచక్ర వాహనాలను ఊరి శివార్లో నిలిపివేశారు. వైద్య, ఆరోగ్యశాఖ స్థానిక ఆసుపత్రిలో సేవలందించడంతో పాటు ప్రత్యేక వైద్య శిబిరాలను డాక్టర్ రఘు ఆధ్వర్యంలో నిర్వహించారు. వనంపూడి సమీపాన గల స్థానిక జెడ్‌పి పాఠశాల వద్ద ఆర్‌టిసి బస్టాండ్ ఏర్పాటు చేసి భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను నడిపారు.

వినోదాలు ఎక్కడ..?

శంబర పోలమాంబ జాతర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది భక్తులకు వినోదాలు కరువయ్యాయి. జాతరకు వచ్చే భక్తులంతా ప్రైవేటుగా ఏర్పాటు చేసే వినోదాలు ఎక్కడున్నాయంటూ ఒకరికొకరు ప్రశ్నించుకోవడం కనిపించింది. ఈ ఏడాది స్థలం లేకపోవడంతో ప్రైవేట్‌గా ఏర్పాటు చేయాల్సిన వినోద కార్యక్రమాలు నిర్వాహకులకు ఆస్కారం లేకుండా పోయింది. అయితే చదునుగుడి సమీపంలో క్యూలైన్లు వద్ద దేవాదాయ శాఖ ఏర్పాటు చేసిన గాన కచేరీలు భక్తులకు కొంత ఊరటనిచ్చాయి.

ఎసిబికి చిక్కిన ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ


ఎసిబికి పట్టుబడిన జెఇ ధనుంజయరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్/ దత్తిరాజేరు

దత్తిరాజేరు మండలంలోని రూరల్ వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న జెఇ ధనుంజయరావు మంగళవారం రాత్రి లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులకు పట్టుబడ్డారు. గతంలో బొండపల్లి మండలంలో ఆయన పని చేశారు. ఆ సమయంలో పని చేసిన ఎం. బుక్ కోసం ఎం.కొత్తవలస గ్రామ సర్పంచ్ భర్త కర్రోతు శ్రీనివాసరావు నుంచి రూ.20వేలు లంచం అడగగా ఆయన ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. విజయనగరంలో ఉడా కాలనీలో జెఇ ఇంటి వద్ద కర్రోతు శ్రీనివాసరావు రూ.20వేలను జెఇకి ఇస్తుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. జెని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎసిబి డిఎస్‌పి రామచంద్రరావు తెలిపారు. ఈ దాడిలో సిఐలు మహేష్, రమణ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.142 కోట్లతో నగర పాలక సంస్థ బడ్జెట్

ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యంగా కేటాయింపులు : మేయర్



సమావేశంలో హాజరైన కార్పొరేటర్లు; మాట్లాడుతున్న మేయర్ వి.విజయలక్ష్మి

ప్రజాశక్తి -విజయనగరం టౌన్

నగరాభివృద్ధితో పాటు ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రూ.142 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నగర పాలక సంస్థ పాలకవర్గ సభ్యులు ఆమోదించారు. మంగళవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో జరిగిన బడ్జెట్ సమావేశంలో 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి 142 కోట్ల వార్షిక బడ్జెట్ తో వివిధ ప్రతిపాదనలను కమిషనర్ ఆర్. శ్రీ రాములునాయుడు వివరించారు. ముందుగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, ఆర్థిక వనరుల రాబడి, ఖర్చులు ఏ విధంగా ఉంటాయన్న విషయాలపై డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ ఏడాది అన్ని ఖాతాల పద్దుల కింద సాధారణ, మూలధనం రాబడి సుమారు రూ.107 కోట్లు వచ్చింది. ముగింపు నిల్వ రూ.14కోట్లు ఉంది. 2023-24లో సుమారు 142 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో రూ. 72 కోట్లు నగర అభివృద్ధికి కేటాయించారు. రూ.10కోట్లతో రహదారుల నిర్మాణం, రూ.5.82 కోట్ల బిపిఎస్ నిధులు, ఆర్థిక సంఘం నిధులు రూ.10కోట్లతో అభివృద్ధి పనులు, కోటి రూపాయలతో సచివాలయాల పక్కా భవనాల నిర్మాణం, రూ.2 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం, కోటి రూపాయలతో ఉద్యానవనాల అభివృద్ధి, రూ.5 కోట్ల సాధారణ నిధులతో కాలువలు, కల్వర్టుల నిర్మాణం, కోటి యాభై లక్షలతో సెంట్రల్ లైటింగ్, జంక్షన్ లైటింగ్ అభివృద్ధి, రూ.50 లక్షలతో పార్కులు, క్రీడా ప్రాంగణాల అభివృద్ధి, రూ.40 లక్షలతో సామాజిక మరుగుదొడ్ల అభివృద్ధి, కోటి యాభై లక్షలతో నీటి సరఫరా నిర్వహణ, పైపులైన్లు విస్తరణ, రూ.50లక్షలతో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, కోటి రూపాయల అమృత పథకం-2 నిధులతో వివిధ అభివద్ధి పనులు, ప్రతి సచివాలయ పరిధిలో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగర అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నామని అన్నారు. ఆదాయ మార్గాలను పెంచుకొని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ ఈ వార్షిక బడ్జెట్ ప్రజావసరాలను తీర్చేందుకు, నగరాభివద్ధికి దోహదపడు తుందన్నారు. ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ మాట్లాడుతూ ఆదర్శ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. బడ్జెట్ అంశాలపై వివిధ డివిజన్ల కార్పొరేటర్లు బండారు ఆనందరావు, ముద్దాడ రమణి, మారోజు శ్రీనివాసరావు, పిన్నింటి కళావతి, కంటుభుక్త తవిటి రాజు మాట్లాడారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ రేవతి దేవి, ఇఇ కె.శ్రీనివాసరావు, ఎసిపిలు మధుసూదనరావు, అమ్మాజీ రావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చర్చ లేకుండానే బడ్జెట్ ఆమోదం : సగం మంది కార్పొరేటర్లు డుమ్మా..

కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం ఎటువంటి చర్చా లేకుండానే ముగిసింది. నగరాభివద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై ఆరోగ్య కరమైన చర్చ జరిగినప్పుడే నగర పాలక సంస్థ కు, పాలక వర్గానికి మంచి గుర్తింపు ఉంటుంది. కానీ అందుకు విరుద్ధంగా కార్పొరేటర్ల తీరు ఉంది. కార్పొరేటర్లు 50 మందిలో 49 మంది అధికార పార్టీ కార్పొరేటర్లు కావడంతో అధినాయకత్వం చెప్పిందే వేదం మాదిరి కనీసం ఆయా కార్పొరేటర్లు అభిప్రాయాలు కూడా చెప్పకుండానే సమావేశం సాగింది. ప్రాముఖ్యత కలిగిన కౌన్సిల్ బడ్జెట్ సమావేశానికి పూర్తి స్థాయి లో కార్పొరేటర్లు హాజరు కావాల్సి ఉండగా, సగం మంది కూడా హాజరు కాలేదు. బడ్జెట్‌పై సీనియర్ కార్పొరేటర్లు తప్ప మిగతా కార్పొరేటర్లు మాట్లాడలేదు. కనీసం ఈ బడ్జెట్ సమావేశంలోనైనా మాట్లాడే అవకాశం వస్తుందని భావించిన కొందరు కార్పొరేటర్లకు నిరాశే ఎదురైంది. సీనియర్ నాయకులు అన్ని వారై వ్యవహరిస్తుండటంతో మిగతా కార్పొరేటర్లు ఆవేదన చెందుతున్నారు.

ఉత్తమ సేవలందించండి

మెడికల్ ఆఫీసర్లకు కలెక్టర్ సూచన


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

వైద్య వృత్తి చాలా పవిత్రమైనదని.. ఆ వృత్తిని ఆస్వాదిస్తూ ప్రజలకు మెరుగైన రీతిలో సేవలందించాలని మెడికల్ ఆఫీసర్లను ఉద్దేశించి కలెక్టర్ ఎ. సూర్యకుమారి అన్నారు. చక్కటి చిరునవ్వుతో పలకరించటం ద్వారా రోగుల మనసును తేలిక చేయాలని తర్వాత చికిత్స అందజేయాలని హితవు పలికారు. వైద్యపరమైన జాగ్రత్తలు తీసుకొనేలా ఆరోగ్యాన్ని కాపాడుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఇటీవల నియమితులైన మెడికల్ ఆఫీసర్లకు స్థానిక డిఎంహెచ్ఓ కార్యాలయంలో మంగళవారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలు అందించడం అదృష్టంగా భావించాలని, మనసుకు సంతృప్తి కలిగేలా పని చేయాలని పేర్కొన్నారు. ప్రజలతో ప్రేమ పూర్వకంగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకోవాలని, మెరుగైన రీతిలో చికిత్స అందజేయాలని చెప్పారు. సాధ్యమైనంత మేరకు చిన్నచిన్న కేసులను రిఫరల్ చేయొద్దని సూచించారు. స్థానిక పరిస్థితులు, వాతవరణాన్ని దృష్టిలో ఉంచుకొని అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఉత్తమ సేవలందించాలని హితవు పలికారు. కార్యక్రమంలో డిఎంహెచఒ డాక్టర్ ఎస్‌వి రమణ కుమారి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తులసి, ఇతర వైద్యులు, డెమో సెక్షన్ అధికారులు, సిబ్బంది, అధిక సంఖ్యలో మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సిటిజెన్ ఔట్ రీచ్ సర్వే 84శాతం పూర్తి

కలెక్టర్ సూర్య కుమారి

ప్రజాశక్తి-విజయనగరం

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలుపై ప్రజల అభిప్రాయాన్ని సేకరించే సిటిజెన్ ఔట్ రీచ్ కార్యక్రమం జిల్లాలో 84 శాతం పూర్తి అయినట్లు జిల్లా కలెక్టర్ ఎ. సూర్య కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30, 31 తేదీలలో ఇంటింటి సర్వే చేపట్టామని, ఈ సర్వేలో పథకాలు సక్రమంగా అందుతున్నదీ, లేనిదీ, సచివాలయ సేవలు సకాలం లో అందుతున్నదీ లేనిదీ, వాటి నాణ్యత ఎలా ఉంది, వాలంటీర్ సేవలు ఏ విధంగా అందిస్తున్నారు తదితర అంశాల పై లబ్ధిదారుల నుండి అభిప్రాయ సేకరించినట్లు తెలిపారు. ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో లైన్ డిపార్టెమెంట్‌లతో మండల బృందాలను ఏర్పాటు చేసి ఇంటింటికీ సర్వే చేసి సంక్షేమ పథకాల అమలు, సచివాలయాల ద్వారా అందుతున్న సేవలపై అడిగి తెలుసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో 6,29,135 కుటుంబాలకు గాను 5,24,845 కుటుంబాలను ఈసర్వే ద్వారా కలుసుకొని, వారి అభిప్రాయాలను తెలుకున్నామన్నారు. సర్వే వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు.

సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-చీపురుపల్లి

ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలో ఫిబ్రవరి 10 నుంచి జరగబోయే 5వ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆదర్శ డిగ్రీ కళాశాల నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి, అనంతరం తహశీల్దార్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష మాట్లాడుతూ డిసెంబర్ వరకు ఇంటర్న్‌షిప్ పేరుతో విద్యార్థులు తరగతులకు దూరం కాగా,ఆ తర్వాత సెలవులు ఉండటం వలన ఇప్పటికీ క్లాసులు పూర్తిగా జరగలేదని తెలిపారు.ఉన్నత విద్యా కమిషన్ ఫిబ్రవరి 28 తేదీ వరకూ క్లాసులు జరపాలని ఆదేశించినా యూనివర్సిటీ బోర్డ్ మాత్రం పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ఆదేశాలను దిక్కరించి ఫిబ్రవరి 10 నుంచి 5వ సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు టైం టేబుల్ విడుదల చేయడం సరికాదని అన్నారు. తక్షణమే విసి స్పందించి పరీక్షలు వాయిదా వేయాలని కోరారు.

రేషన్ సరుకులతో పాటు గోధుమ పిండి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని విజయనగరం, నెల్లిమర్ల, బొబ్బిలి, రాజాం మున్సిపల్ ప్రాంతాల్లో చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేసే బియ్యం, పంచదార, కందిపప్పు వంటి సరుకులతో పాటు గోధుమ పిండి కూడా అందజేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. ఫిబ్రవరి నుంచి పట్టణ పరిధిలోని చౌకధరల దుకాణాల ద్వారా ఒక్కో కార్డుకు కిలో రూ.16 చొప్పున రెండు కిలోలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ ఏరియాలో ఉన్న 92,935 మంది కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీలో ఆర్‌పిల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం

ప్రధాన మంత్రి - సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమ క్రమబద్ధీకరణ పథకంలో భాగంగా ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీలో ఇన్సెంటివ్ పద్ధతిలో పని చేసేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్, వ్యవసాయ, ఉద్యాన కోర్సుల్లో లేదా సాధారణ డిగ్రీ చేసిన వారు, బ్యాంకింగ్ అంశాలపై అవగాహన ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్ చేసిన వారికి అధిక ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైన జిల్లా రిసోర్స్ పర్సన్లకు ఇన్సెంటివ్ పద్ధతిలో భృతి చెల్లిస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ddhvzm@yahoo.com మెయిల్ కి లేదా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, జిల్లా ఉద్యాన అధికారి కార్యాలయం, కలెక్టరేట్ మొదటి అంతస్తు, విజయనగరం చిరునామాకు పంపించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 79950 86762 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి ఎం.దీపిక

నిందితులకు శిక్షపడేలా చర్యలు

నేర సమీక్షా సమావేశంలో ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి-విజయనగరం

ప్రాసిక్యూషన్ కేసుల్లో నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌పి ఎం.దీపిక పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలన్నారు. పోలీసు స్టేషను పరిధిలో గ్రామాలను ఆయా పోలీసు స్టేషనులో పని చేసే పోలీసు సిబ్బందికి దత్తతగా ఇవ్వాలని, ఆయా గ్రామాల్లో తరుచూ గ్రామ సందర్శించాలని తెలిపారు. గ్రామస్థాయిలో సమాచారం సేకరించేందుకు ముఖ్యమైన వ్యక్తులు, అధికారుల ఫోను నంబర్లను సేకరించాలని, సమాచార వ్యవస్థను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. న్యాయ స్థానాల్లో విచారణలో ఉన్న కేసుల్లో ప్రాసిక్యూషను ప్రాధాన్యత క్రమంలో సంబంధిత సిఐలు, ఎస్ఐలు గమనించాలని, నిందితులు శిక్షింపబడే విధంగా సాక్ష్యాలను సకాలంలో కోర్టులో ప్రవేశపెట్టి, నిందితులపై నేరం నిరూపణ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలన్నారు. గత నెలలో దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను సమీక్షించి, దర్యాప్తు పూర్తి చేయలేకపోవడానికి కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. సమావేశంలో డిఎస్‌పిలు ఆర్.శ్రీనివాసరావు, వీరకుమార్, ఎం. వెంకటేశ్వర్లు, ఎల్.మోహనరావు, ఎల్.శేషాద్రి, పలువురు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశం వాకౌట్

- సభ్యులంటే గౌరవం లేదని వైసిపి
- తమ వార్డులు పట్ల వివక్షత అన్యాయమని టిడిపి కౌన్సిలర్లు వేర్వేరుగా వాకౌట్
- ఎమ్మెల్యే బుజ్జగించినా ఆగని కౌన్సిలర్లు

ప్రజాశక్తి- బొబ్బిలి

కౌన్సిలర్లు అంటే పూర్తిగా గౌరవం లేదని వైసిపి కౌన్సిలర్లు, టిడిపి వార్డులు పట్ల వివక్షత చూపుతున్నారని టిడిపి కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తు కౌన్సిల్ సమావేశం నుంచి వేర్వేరుగా వాకౌట్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అధ్యక్షతన మున్సిపల్ బడ్జెట్, అత్యవసర సమావేశం జరిగింది. అధికారులు తీరుపై వైసిపి కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్ తీరుపై టిడిపి కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కౌన్సిల్ సమావేశం నుంచి వేర్వేరుగా వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు.

కౌన్సిలర్లకు ఇవ్వని గౌరవం లేదు

కౌన్సిల్ సభ్యులంటే మున్సిపల్ అధికారులకు గౌరవం లేదని వైసిపి కౌన్సిలర్ ఇంటి గోవిందరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడుతున్న అధికారులు కౌన్సిల్ సభ్యులపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ డ్రైవర్లను అద్దె వాహనాలకు వినియోగించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. వాటర్ ట్యాంకర్ కోసం ఎప్పుడు ఫోన్ చేసినా డీజిల్ లేదని సమాధానం చెప్తున్నారని, డీజిల్ మాత్రం అవసరానికి మించి వినియోగిస్తున్నారని అన్నారు. 50శాతం వరకు డీజిల్ వృథా అవుతుందన్నారు. పింఛన్ల మంజూరులో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సచివాలయ ఉద్యోగులు కూడా కౌన్సిలర్లను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం అధికారుల తీరుకు నిరసనగా వైసిపి కౌన్సిలర్లు ఇంటి గోవిందరావు, ఎన్.బాబు, పి.ఉమ, డి.సునీత, వి.వనజకుమారి, ఎన్.శారద, సిహెచ్ అనసూయమ్మ, ఒమ్మి లక్ష్మి, ఎస్.లక్ష్మి, కె అప్పన్న సభ్యులు వాకౌట్ చేశారు.



కౌన్సిలర్లంతా బయటకు వెళ్లిపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

టిడిపి వార్డులు పట్ల వివక్షత అన్యాయం

మున్సిపల్ చైర్మన్ తీరుకు నిరసనగా టిడిపి కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. టిడిపి వార్డులు పట్ల వివక్షత చూపుతున్నారని టిడిపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు ఆరోపించారు. కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలను చెప్తున్నప్పటికి చైర్మన్ సావు మురళి వినలేదని ఆరోపిస్తూ సమావేశం నుంచి వాకౌట్ చేశారు.

బడ్జెట్ ఏకగ్రీవంగా ఆమోదం

మున్సిపల్ బడ్జెట్ ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అధ్యక్షతన కౌన్సిల్ బడ్జెట్ సమావేశం జరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.23.78కోట్ల ప్రారంభ నిల్వతో ప్రారంభమై రాబడి రూ.26.25కోట్లు, ఖర్చు రూ.25.45కోట్లు, అంతిమ నిల్వ 324.58కోట్లు అంచనతో బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. బడ్జెట్ ఆమోదం అనంతరం వైసిపి, టిడిపి కౌన్సిలర్లు వేర్వేరుగా వాకౌట్ చేశారు.


వైసిపి కౌన్సిలర్లను బుజ్జగిస్తున్న ఎమ్మెల్యే వెంకటచినప్పలనాయుడు

ఎమ్మెల్యే బుజ్జగించినా వినని కౌన్సిలర్లు

అధికారులు తీరుకు నిరసనగా వాకౌట్ చేసిన వైసిపి కౌన్సిలర్లను ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు బుజ్జగించే ప్రయత్నం చేసినప్పటికీ వారు వినలేదు. దీంతో ఎమ్మెల్యే నిరాశతో కౌన్సిల్ హాల్లోకి వెళ్లిపోయారు. కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతున్న సమయంలో ఎమ్మెల్యేకు ఫోన్ రావడంతో మాట్లాడేందుకు బయటకు వెళ్లారు. ఎమ్మెల్యే బయట ఉన్న సమయంలో కౌన్సిలర్లు వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు. వాకౌట్ చేసిన కౌన్సిలర్లతో ఎమ్మెల్యే మాట్లాడిన ఫలితం లేకపోయింది. దీంతో సమావేశాన్ని వాయిదా వేసి బయటకు వచ్చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కౌన్సిలర్ల వ్యతిరేకతను బయటకు రాకుండా చూసేందుకు ఎమ్మెల్యే సమావేశానికి హాజరైనట్లు ప్రచారం జరిగినా ఆయన మాట కూడా వినకపోవడంతో చర్చనీయాంశమైంది.

న్యాయం చేయాలని ఉపాధి కూలీల ధర్నా

కొత్తవలస : సంతపాలెం గ్రామంలో ఉపాధి కూలీలకు న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద మంగళవారం ఉపాధి కూలీలతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు అన్యాయం చేయవద్దని డిమాండ్ చేశారు. మేట్ల వ్యవహారంలో తలెత్తిన సమస్య మరింత జటిలం కాకముందే సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. గ్రామానికి చెందిన కొంతమంది నాయకులు తమను రెండుగా చీల్చే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మేట్లు విషయంలో స్థానిక నాయకులు పెత్తనం తగదని ఈ సమస్య పరిష్కారం చేయాలని ఎంపిడిఒకు విన్నవించారు. అనంతరం ఎంపిడిఒ వద్దకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఎపిఒ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా సాధనకై సమరయాత్ర

బొబ్బిలి : రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనకై చేస్తున్న సమరయాత్ర ఈ నెల 2న విజయనగరానికి వస్తుందని దీన్ని అందరూ జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న అన్నారు. పట్టణంలోని క్యాంప్ గంటి ప్రసాదం స్మారక భవనంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ యాత్ర ద్వారా హోదా, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఉన్నటువంటి విద్యార్థి యువజన సంఘాలు, ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో హిందూపురం నుండి ఇచ్ఛాపురం వరకు జరిగే ప్రత్యేక హోదా సమరయాత్ర 2న జిల్లాకు చేరుకుంటుందని 3న ఉదయం రోడ్ షో, బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి జోను రవికుమార్, బొబ్బిలి మండల కార్యదర్శి హరి, నాయకులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాడు - నేడు పనులు పరిశీలన

వేపాడ : మండలంలోని సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు రెండో విడత పనులను ఎపిసి స్వామి నాయుడు మంగళవారం పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం బొద్దాం గ్రామంలో ఎంపిపి పాఠశాలను ఆయన సందర్శించారు. ఆయన వెంట ఎంఇఒ శ్రీదేవి పాల్గొన్నారు.

కళ్లాలుగా రహదారులు

వేపాడ : మండలంలోని ప్రధాన రహదారులైన ఎం. సింగవరం, బానాది, ఆతవ, సింగరాయి, గుడివాడ, డిఆర్ పేట గ్రామాల రహదారులు పెసర పంటకు కల్లాలుగా మారాయి. రైతుకు సంబంధించిన పెసర పంటను రోడ్లపై వేసి ఎండబెడుతున్నారు. దీంతో ఈ రహదారులపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణానికి ఇబ్బంది లేకుండా తగు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తారకరత్న కోలుకోవాలని ప్రత్యేక పూజలు

కొత్తవలస : నందమూరి తారకరత్న వేగంగా కోలుకోవాలని మండల టిడిపి ఆధ్వర్యంలో నాయకులు దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నారా లోకేష్ పాదయాత్ర ఎటువంటి ఆటంకాలూ జరగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటరమణ, విశాఖ పార్లమెంట్ బిసి కమిటీ ఉపాధ్యక్షులు బొబ్బిలి అప్పారావు, రాష్ట్ర అయ్యారక సాధికార సమితి కన్వీనర్ బంగారు రమేష్, కొరుపోలు అప్పారావు, టిడిపి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కనకాల శివ, అయ్యారక సాధికార సమితి డైరెక్టర్స్ బెహరా నాగేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు లాలం అర్జునరావు, నక్కరాజు చిన్న రాము, గొంప దుర్గ ఉమేష్, పొట్నూరు వెంకట రత్నాజీ, రాష్ట్ర ఐటిడిపి కోఆర్డినేటర్ చీపురుపల్లి సాగర్ కళ్యాణ్, విశాఖ టిడిపి పార్లమెంట్ తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి విరోతు శివాజీ, తుమ్మికాపల్లి మాజీ సర్పంచ్ పిల్లా అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన

బాడంగి : మండలంలోని గొల్లాది గ్రామంలో ఉపాధి హామీ పనులను కేంద్ర కమిటీ సభ్యులు గిరిజా శంకర్ పాడి, సత్యరంజాన్ రౌతు మంగళవారం పరిశీలించారు. చాకలి కోనేరు, పండ్లు తోటలు, అవెన్యు ప్లాంటేషన్, ఇరిగేషన్ చెరువు, టెక్సటైల్స్, పిఎంఇజిపి యూనిట్స్‌ను పరిశీలించారు. ఉపాధి కూలీలకు సమయానికి వేతనాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఎపిడి పి.రాధ, ఎంపిడిఒ అక్కారావు, డిపిఎం ఆదయ్య, ఎపిఒ లక్ష్మీపతి రాజు, పాల్గొన్నారు.

మరిశర్లను కలిసిన సోము వీర్రాజు

బొబ్బిలి : వైసిపి కౌన్సిలర్ మరిశర్ల రామారావునాయుడును బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. సామాజిక బాధ్యతతో పని చేస్తున్న మరిశర్ల రామారావును బిజెపిలో చేరాలని సోము వీర్రాజు కోరినట్లు తెలిస్తోంది. ఒకే భావజాలంతో తాము పని చేస్తున్నామని వీర్రాజు అన్నారు. బిజెపిలోకి వస్తే కలిసి చేద్దామంటూ రామారావును కోరారు. ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని రామారావు అన్నట్లు సమాచారం.

విధి నిర్వహణపై అవగాహన

వేపాడ : మండలంలోని 18 గ్రామ సచివాలయాలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శిలతో పాటు డిజిటిల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లుతో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ మంగళవారం తన కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సచివాల సిబ్బందికి పింఛన్ల పంపిణీ, పంచాయతీకి రావలసిన పన్నులు, వెల్ఫేర్ స్కీమ్ బెనిఫిట్స్ పైన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

మృతిని కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

రాజాం/ వంగర : రాజాం పట్టణం టిడిపి ప్రధాన కార్యదర్శి శాసపు రమేష్ వాళ్ల మామయ్య కెంబూరు సూర్యనారాయణ(72) తన స్వగృహం పోనిగుటి వలసలో అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి, టిడిపి రాజాం నియోజకవర్గం ఇంఛార్జి కోండ్రు మురళీమోహన్ పొనుగుటి వలస వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మాస్టర్ బ్యాడ్మింటన్ పోటీలకు అస్లాం

శృంగవరపుకోట : పట్టణంలోని ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మొహమ్మద్ ఖలీలుల్లా (అస్లాం) పురుషుల సింగిల్స్ విభాగంలో రాష్ట్రస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయినట్లు అకాడమీ చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ఈ నెల 2 నుండి 5వ తేదీవరకు జరగబోవు రాష్ట్రస్థాయి పోటీల్లో అతను పాల్గొంటారన్నారు. ఈ మేరకు క్రీడాకారుడుని జిల్లా బ్యాడ్మింటన్ అసోషియేషన్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, డాక్టర్ ఎస్.వి. సత్యశేఖర్, ఆనల రమేష్, ఆనల మోహన్, పొట్నూరు శ్రీరాములు, అభినందిస్తూ రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాక్షించారు.

రెండు గ్రామాల్లో పొలంబడి

బొబ్బిలి : మండలంలోని అలజంగి, కారాడ గ్రామాల్లో పొలబండి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎడిఎ ఎస్‌బి. శ్రీనివాస్ చార్య, జిల్లా ఎడిఎ కె. ప్రకాష్ పాల్గొని పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ప్రతి పంటపై రైతుకు అవగాహన ఉండాలన్నారు. తక్కువ రసాయన పురుగు మందులతో వ్యవసాయం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం, వాటి ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ సెంటర్ ఎడిఎ డి. భారతి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా కంటి వైద్య శిబిరం

గంట్యాడ : మండలంలోని కొండ తామరపల్లి గ్రామంలో కోడెల ముత్యాల నాయుడు ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. 45 మంది రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కోడెల అప్పలస్వామి నాయుడు 29వ వర్ధంతిని పురస్కరించుకొని వైద్య శిబిరం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉచితంగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శ్రీనివాసరావు, ఎర్ర చంద్రమ్మ రోగులు తదితరులు పాల్గొన్నారు.

అండర్- 19 ఖోఖో జట్టు ఎంపిక

విజయనగరం టౌన్ : అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా ఖోఖో జట్టు ఎంపిక పూర్తి అయ్యింది. మంగళవారం స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జరిగిన ఎంపికకు జిల్లా వ్యాప్తంగా క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ కలిగిన వారిని ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కృష్ణ తెలిపారు. 26 మందితో జట్టును ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపిక ప్రక్రియలో వ్యాయామ ఉపాధ్యాయులు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపర్చుకోవాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- దత్తిరాజేరు

వైద్యశాఖాధికారులతోపాటు కింది స్థాయి సిబ్బంది కూడా సక్రమంగా విధులు నిర్వహించకుండా కనీసం ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా, గౌరవం లేకుండా విధులు నిర్వహిస్తున్నారని వైస్ ఎంపిపి బమ్మిడి అప్పలనాయుడు ఎమ్మెల్యే అప్పలనరసయ్య దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి అధికారులు పనితీరు మెరుగుపరచుకోవాలని, ప్రజా ప్రతినిధులను గౌరవించాలని హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి గేదెలు సింహాద్రి అప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు నెలల కాలంలో జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని అన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందించడంలో సచివాలయ సిబ్బంది పనితీరు లోపం వల్ల ఇటీవల గడసాం సచివాలయం పరిధిలో కొంతమంది లబ్ధిదారులు నష్టపోయారని ఇటువంటి చర్యలు మళ్ళీ పునరావృతం కాకూడదన్నారు. సచివాలయ సిబ్బంది స్థానిక సంస్థల ప్రతినిధులను గౌరవించడం లేదని కొంతమంది సభ్యులు వాపోవడంతో సర్పంచులు సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది పనితీరుపై దృష్టి పెట్టాలన్నారు. కోమటిపల్లి, దత్తి, వంగర, పెద కాద, గొభ్యాం గ్రామాలలో కొనుగోలు లేకపోవడంతో రైతుల వద్ద ధాన్యం నిల్వ ఉండిపోయాయని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తాడేంద్రవలస, సరాయివలస గ్రామాలలో నీటి కొరత తీవ్రంగా వేధిస్తుందని త్వరలో రానున్న వేసవి దృష్ట్యా సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల సర్పంచులు వాపోయారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపిపిలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, పిఎసిఎస్ చైర్మన్ సుమల శ్రీనివాసరావు, మాజీ జెడ్‌పిటిసి మంత్రి అప్పలనాయుడు, ఎఎంసి వైస్ చైర్మన్ శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి వాణిశ్రీ, తహశీల్దార్ రమేష్, పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

కుష్టు వ్యాధిపై అవగాహన

కొత్తవలస : మండలంలోని వియ్యంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దేవాడ, ముసిరామ్, చిన్నిపాలెం, రామలింగాపురం గ్రామాలలో మంగళ వారం కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు ఇ. గోపాల కృష్ణ, డాక్టర్ బి. సింహాద్రి నాయుడు ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి పక్షోత్సవాల్లో భాగంగా అవగాహనా ర్యాలీ నిర్వహించినట్లు ఎమ్‌పిహెచ్ఇ ఒ. తిరుపతి రావు తెలిపారు. ఇది మైకోబాక్టీరియం లెప్రే వల్ల వస్తుందని, దీనికి ఎం.డి.టి మందులు ప్రభుత్వ ఆసుపత్రులలో దొరుకుతాయని తెలిపారు. దేవాడలో ఉపాధిహామీ వేతనదారులకి కుష్టు వ్యాధి పై అవగాహనా కల్పించారు. కుష్ఠు రోగులను ప్రేమతో,ఆప్యాయంగా చూడాలని, వారి పట్ల వివక్ష చూపరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో, పి.హెచ్.ఎన్. జగదాంబ, హెచ్.వి. పద్మావతి, పంచాయతీ సర్పంచ్ రంగుడు పద్మాలత తదితరతులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: కుష్టి వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నారాయనప్పవలస పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెసి రాజు అన్నారు. మంగళవారం పాఠశాలలో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా పక్షోత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్పర్శ -కుష్టు వ్యాధి పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ఆ శాఖ సిబ్బంది కె.కర్ణ, బి.నారాయణ రావులు కుష్టు వ్యాధి లక్షణాలు- చికిత్స-నివారణ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం. జెసి రాజు గాంధీ విగ్రహం వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కొత్తవలస : అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో 5 ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ఎసిడిపిఒ తవిటినాయుడు తెలిపారు. స్థానికులై ఉండి, 21 నుంచి 35 సంవత్సరంలోపు వయసు కలిగి, పదో తరగతి పాస్ అయి ఉండాలని, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికలు జరుగుతాయని తెలిపారు. భోగాపురం మండలంలో జగ్గయ్యపేట అంగన్వాడీ కార్యకర్త (బిసి-ఇ), చినకొండ రాజుపాలెం హెల్పర్(బిసి-డి), పూసపాటిరేగ మండలం పేరాపురం-1 అంగన్వాడి కార్యకర్త (బిసి-సి), మినీ అంగన్వాడీలు కొత్త నడిపల్లి(బిసి-ఇ), పెద్దబత్తివలస(ఎస్‌సి) పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు ఐసిడిఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

గరివిడి: చీపురుపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో గల చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడి హెల్పర్ పోస్టుల నియమకానికి నోటిఫికేషన్ విడుదలైనట్లు సిడిపిఒ కె. రాజరాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికులై ఉండి 21 నుంచి 35 సంవత్సరాలు లోపు వయసు కలిగి 10వ తరగతి పాసై ఉండాలని, రిజర్వేషన్ ప్రకారంగా ఎంపిక జరుగుతాయని తెలిపారు. చీపురుపల్లి మండలం పురేయవలస (ఎస్‌సి), మండలం ఆర్తివలస(బిసిఎ), మెరకముడిదాం మండలంలోని పులిగుమ్మి (బిసిఇ), కొండ లావేరు (బిసిబి), గరివిడి మండలం శాతం వలస (ఒసి), దేవాడ (ఒసి) కేటాయించామన్నారు. నేటి నుంచి 10వ తేదీ లోగా చీపురుపల్లి ఐసిడిఎస్ కార్యాలానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ముఖ హాజరు రద్దు చేయాలి

బొబ్బిలి : రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల ముఖ హాజరుకు జీతం ముడిపెట్టడం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు అన్నారు. పట్టణంలో వేణుగోపాల ఆలయం కూడలి వద్ద మంగళవారం కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వైసిపి ప్రభుత్వం హాజరుకు జీతానికి లింకు పెట్టి కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు పడే పరిస్థితి కల్పిస్తున్నారని అన్నారు. తెల్లవారి 6 గంటకు చెత్త సేకరణ, రోడ్లు, కాలువలు క్లీనింగ్ చేయడానికి పట్టణం అంతా తిరిగే కార్మికులకు, చదువు అంతగా లేని, స్మార్ట్ ఫోన్లు ఉపయోగించడం రాని కార్మికులకు ఫేషియల్ యాప్ అమలు చేయడం సబబు కాదన్నారు. కార్మికుల పనిని సూపర్‌వైజర్లు, సచివాలయ ఉద్యోగులు కమిషనర్ రోజూ పర్యవేక్షిస్తారని అలాంటి వారికి ముఖ హాజరు దేనికని ప్రశ్నించారు. ప్రజల కోసం తమ జీవితాలను త్యాగం చేస్తున్న మున్సిపల్ కార్మికులపై ఇటువంటి విధానం అంగీకరించేది లేదన్నారు. ప్రజా ప్రతినిధులు అని చెప్పుకునే వాళ్లు ప్రజాధనాన్ని ప్రభుత్వ ఆస్తులను ఏ విధంగా లూటీ చేస్తున్నారో ప్రజలందరికీ తెలుసునని వాటిని అడ్డుకోవడానికి టెక్నాలజీని వాడాలని చెప్పారు. ఫిబ్రవరి 2న మున్సిపల్ ఆఫీసు వద్ద ధర్నా చేపడతామని తెలియజేశారు.

పర్యవేక్షణతోనే సత్ఫలితాలు

రామభద్రపురం: నిరంతర పర్యవేక్షణతోనే సత్ఫలితాలు సద్యపడతాయని జిల్లా సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ అన్నారు. మంగళవారం స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఏ అంశమైనా పర్యవేక్షణ లోపిస్తే సత్ఫలితాలు రావని, దానివల్ల ప్రభుత్వం ఆశించిన ఫలితాలు సాధ్య పడక పేదవాడికి అన్యాయం జరుగుతుందని అన్నారు. విద్యా వ్యవస్థలో కూడా ఉపాధ్యాయులు, పర్యవేక్షించాల్సిన అధికారుల నిర్లక్ష్యం వల్ల పేద విద్యార్థులు నష్టపోతారని చెప్పారు. ఇకనైనా పనితీరును మెరుగు పర్చుకొని విద్యార్థులకు న్యాయం చేయాలని హెచ్చరించారు. ఇటీవలే విద్యాశాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఇదే పాఠశాలలో తనిఖీలు నిర్వహించడం గమనార్హం. ఆయన వెంట బొబ్బిలి రెవిన్యూ డివిజన్ అధికారి శేష శైలజ,ఉప జిల్లా విద్యాశాఖాధికారి తిరుపతినాయుడు తదితరులున్నారు.

ఆకట్టుకున్న ఎడ్ల పరుగు పందేలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వావిలిపాడులో పరదేశిమాంబ తీర్థ మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల పరుగు పందేలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో 24 ఎడ్ల బళ్ళు పాల్గొని పోటీ పడ్డాయి. ఈ పోటీలు గ్రామ సర్పంచ్ బీల రాజేశ్వరి, వైసిపి నాయకులు సతీష్, పాలకవర్గ సభ్యులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించగా విజేతలకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎంపిపి డి. సత్యవంతుడు, డిసిసి చైర్మన్ వివి చిన్నంనాయుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పారావు, మండల వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఈర్ల సన్యాసినాయుడు, గ్రామ పెద్దలు చేతుల మీదుగా అందజేశారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

అమ్మవారిని దర్శించుకున్న గొంప కృష్ణ

మండలంలోని వీలుపర్తి పంచాయతీ పరిధిలో గల చామలాదేవి అగ్రహారం గ్రామంలో నిర్వహించిన పరదేశిమాంబ జాతరలో ఎస్‌కోట నియోజకవర్గం టిడిపి నాయకులు గొంప కృష్ణ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వేపాడ మండల టిడిపి అధ్యక్షుడు గొంప వెంకటరావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతి, సర్పంచ్ సేనాపతి లీల, టిడిపి నాయకులు సేనాపతి అప్పారావు, బల్లంకి గ్రామం మాజీ సర్పంచ్ గొర్రెలు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను రూపుమాపాలి

ప్రజాశక్తి - జామి

బాల్య వివాహాలు జరపడం చట్టరీత్యా నేరమని, వాటిని రూపుమాపాలని సామాజిక, పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయాధికారి బి.రామకృష్ణ అన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు మీరంతా చేయూతనివ్వాలని కోరారు. మంగళవారం జామి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహల నిర్మూలన, రక్తహీనత, లింగ వివక్ష, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ప్రపంచంలో బాల్య వివాహాలు జరుగుతున్న దేశాల్లో భారత్ మూడో స్థానంలో ఉందన్నారు. మన దేశంలో బాల్య వివాహాలు జరుగుతున్న జిల్లాలలో మన జిల్లా ఐదో స్థానంలో ఉందని వివరించారు. కేవలం రక్తహీనత కారణంగా బాల్యంలో గర్భం దాల్చిన వారిలో 59 శాతం మంది మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి మరణాలు జరగకుండా అడ్డుకట్ట వేయాలంటే బాల్యవివాహాలను నిర్మూలించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

చీపురపల్లి: కొత్తగా వివాహమైన మహిళలు, తల్లి కాబోతున్న వారితో సహేలి గ్రూపులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్య కుమారి ఆదేశించారు. వీరికి వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, పోషకాహారం, రక్త హీనత నివారణ, గర్భం దాల్చినతర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిల్లల పోషణ తదితర అంశాలను వివరించాలని సూచించారు. వీరికి అవగాహన కల్పించడంలో వైద్యాధికారులదే కీలక పాత్ర అని స్పష్టం చేశారు. చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో జరుగుతున్న సుస్థిర అభివద్ధి లక్ష్యాల సాధన, విద్య, రీ-సర్వే, గహ నిర్మాణం తదితర సంక్షేమ, ప్రభుత్వ కార్యక్రమాలపై, సంభందిత శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో, ఎంపిడిఓ కార్యలయంలో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. మండలాల వారీగా పిల్లలు, విద్యార్థులు, మహిళలకు నిర్వహించిన రక్త పరీక్షలపై కలెక్టర్ ఆరా తీశారు. తీవ్ర, అతి తీవ్ర, స్వల్ప రక్త హీనత ఉన్న వారిని గుర్తించి, వారు దానినుంచి బయట పడేవిధంగా కౌన్సిలింగ్ నిర్వహించి, పోషకాహారం, అవసరమైన మందులను అందించాలని సూచించారు. వచ్చే పబ్లిక్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఇఒను కలెక్టర్ ఆదేశించారు. ఇంతవరకు జరిగిన సిలబస్, విలీన పాఠశాలల్లో విద్యార్థుల పరిస్థితి, సూపర్ -60 కార్యక్రమం పైనా ఆరా తీశారు. ఈ ఏడాది జిల్లా విద్యార్థులు ట్రిపుల్ ఐటి సీట్లను ఎక్కువ సాధించడం పై దృష్టి సారించాలని ఆదేశించారు. ఉత్తమ ఫలితాల సాధన కోసమే, ఉపాధ్యాయులను ప్రభుత్వం చాలా వరకు బోధనేతర పనుల నుంచి తప్పించిందని చెప్పారు. డ్రాపౌట్లు, ప్రవేశాలపై ప్రశ్నించారు. డ్రాపౌట్ విద్యార్థులకు మెప్మా, డిఆర్డిఎ సహకారంతో నైపుణ్య శిక్షణ ఇప్పించి, ఉపాధి కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు.

ఉపాధ్యాయులపై కక్ష సాధింపు సరికాదు

విజయనగరం టౌన్ : పాఠశాల విద్యాశాఖాధికారులు అన్ని జిల్లాలలోను పాఠశాలలను సందర్శించి విద్యార్థులు బూట్లు ధరించడం లేదని, యూనిఫామ్ ధరించడంలేదని, గుడ్డు , చిక్కి పెట్టలేదని, మార్కులును ఆన్‌లైన్ చేయలేదని ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యలకు దిగడం సరికాదని మాజీ ఎమ్మెల్సీ గాద శ్రీనివాసులునాయుడు అన్నారు. అధికారుల తీరు ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేసే విధంగా ఉన్నాయి తప్ప తప్పులు సరిదిద్దుకునేలా లేవని అన్నారు. ఈ మేరకు విజయవాడలో విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణను కలిసి వినతి అందజేశారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

లక్కవరపుకోట : ఎల్.కోట పోలీసు స్టేషన్ పరిధి పోతంపేటలో 2016 సంవత్సరంలో నమోదైన హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ మరియు సెషన్స్ జడ్జి బి. సాయి కళ్యాణచక్రవర్తి మంగళవారం తీర్పు వెల్లడించారని ఎస్ఐ ఎం.ముకుందరావు తెలిపారు. పోతంపేటకు చెందిన చంద్రపు గౌరి నాయుడుకి అదే గ్రామానికిచెందిన కోరుకొండ అప్పలపాత్రుడు అలియాస్ రాజు అనే వ్యక్తికి మధ్య పాత కక్షలు కారణంగా ఇరువురు గొడపడ్డారు. అప్పలపాత్రుడు చంద్రపు గౌరినాయుడు తలపై కర్రతో కొట్టడంతో ఆయన మృతి చెందాడు. ఎల్.కోట ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు కేసు నమోదు చేయగా, అప్పటి ఎస్.కోట సిఐ జి.సంజీవరావు దర్యాప్తు చేపట్టారు.విచారణలో నిందితుడు అప్పలపాత్రుడుపై నేరం రుజువు కావడంతో నిందితునికి జిల్లా జడ్జి బి. సాయి కళ్యాణ చక్రవర్తి జీవిత ఖైదు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఇద్దరు దొంగలు అరెస్టు

ప్రజాశక్తి- విజయనగరం

చెడు వ్యసనాలకు బానిసలైన బొండపల్లి గ్రామానికి చెందిన గేదెల సతీష్ (23), కొత్తపేటకు చెందిన గిర్ల ఆనంద్ (23) విజయనగరం పెద్ద చెరువు వద్ద బండి మీద వెళ్తున్న ఒకరిని అడ్డగించి, అతని వద్ద నుంచి వెండి చైన్ బలవంతంగా లాక్కున్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరినీ మంగళవారం అరెస్టు చేసినట్లు సిఐ బి.వెంకటరావు తెలిపారు. ఈ కేసులో ఎస్ఐలు గణేష్, భాస్కరరావు, హెచ్‌సి అచ్చిరాజు, కానిస్టేబుల్ శివకుమార్ క్రియాశీలకంగా పని చేశారని సిఐ వెంకటరావు తెలిపారు.

నేరాలు ఘోరాలు

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని మధుపాడ గ్రామంలో నోట్ల శంకర్రావు (32) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ కిరణ్ కుమార్ నాయుడు అందించిన వివరాలు ప్రకారం.. మృతుడు తన ఇంట్లో ఉన్న రూ. 40 వేలు తీసుకొని వెళ్ళిపోగా తల్లిదండ్రులు మందలిస్తారనే భయంతో పొలంలో జనవరి 28న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారకస్థితిలో ఉన్న శంకర్రావును స్థానికులు 108 వాహనంలో ఎస్ కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం విశాఖపట్నం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడు తండ్రి సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు ముద్దాయిలకు జైలు శిక్ష

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని అంబకండి గ్రామానికి చెందిన జోగ వెంకటరమణకు ఉద్యోగం ఇప్పిస్తానని రూ.4లక్షలు తీసుకున్న ఘటనలో రాజాం మండలం గెడ్డ వలసకు చెందిన బూరాడ శ్రీనివాసరావు, చిన్నంనాయుడులకు ఏడాది జైలు శిక్ష, చెరో వెయ్యి రూపాయలు జరిమానా రాజాం కోర్టు జడ్జి కృష్ణ సాయితేజ విధించినట్లు ఎస్ఐ ఈ. శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. 2016లో ఉద్యోగం ఇప్పిస్తానని జోగ వెంకటరమణకు మాయమాటలు చెప్పి తన వద్ద డబ్బులు తీసుకున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐలు రమేష్, జి. భాస్కరరావు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఇద్దరు ముద్దాయిలకు కోర్టు ఏడాది పాటు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.